# గల్పికలు

## అద్దంలో రూపం

నవయౌవన వధువు నవ్వుకుంది ఆనందంగా. అద్దంలోని రూపం అద్భుతమైన అందంతో అలరారుతోంది. ఎత్తయిన పందిరి మంచం, మెత్తని పరుపు, ఊగులాడే తెల్లని, సన్నని దోమతెర, ద్రాక్షగుత్తులతో సన్నిహితమవుతున్న వరుని రూపం అద్దంలో మెరిశాయి. గదిలోని వెలుగులు అద్దంలో వక్రీకరించాయి. నవ వధువు నవ్వుకుంది ఆహ్లాదంతో.

క్రొత్త సంసారం ఏర్పడింది. బద్ధకంగా పడుకున్న దంపతులకు ప్రొద్దున్నే లేపే దాసి చికాకు కలిగించింది. వధువు తలుపు తీసింది. వరండాలోని నిలువుటద్దంలోంచి దాసిని తనలాంటి మనిషే పిలిచింది. నల్లటిరంగు, చిక్కిపోయిన దవడలు, సంస్కారంలేని శిరోజాలు, మాసి చినిగిన చీర... ఇదా నారూపం? వధువుని చూసి అసూయపడింది దాసి.

గతించిన దినాలలో పరిణామం చెందిన దంపతులు తల్లితండ్రులయ్యారు. ఆడుకునే పాప అద్దంలో నవ్వుకుంది. ఏడ్చేపాప అద్దంలో చూసుకుని ఆశ్చర్యపోయింది. ఆలోచన లేని ఆ పాప మెదడులో అయోమయమైన ఆశ్చర్యం తాండవించింది. ఆద్యంతాలు శూన్యంలా అద్దంలో కనిపించాయి పాపకు.

జీవితంలో అడుగుపెట్టిన భర్త విరామం లేకుండా సంపాదన కార్యక్రమాలలో విహరించాడు. కాలం మార్పులో శరీరం హూనమైంది. ప్రొద్దున్నే లేచి పెరుగుతున్న బొజ్జ, వస్తున్న బట్టతల, ముడతలు పడుతున్న శరీరం, విచారాలు రేఖలుగా ప్రతిబింబిస్తున్న ఫాలం, శక్తి పోయిందని ఘోషిస్తున్న తెల్లవెంట్రుకలు అద్దంలో చూసుకున్నాడు. అద్దమే ఎరుగని వీధిలోని బిచ్చగాళ్ళు, అనాథులు తను పడిన బాధ ఎరుగరనిపించింది.

బస్సులో వెడుతూంటే బ్రతుకు యౌవనంలోని ఒక జ్ఞాపకం ఉంది. ఎదురుగా కూర్చున్న అమ్మాయి ఎదురుగా ముఖంలోకి చూడలేక పోయింది బస్సు కిటికీ అద్దంలో ప్రతిఫలించే తన రూపం తన ప్రక్కనున్న అద్దంలోంచి చూస్తోంది. అదేవిధంగా

ఆమె ప్రతిబింబం తనూ చూసేవాడు, భౌతిక రూపాలు చూడడానికి భయపడి మెత్తని గందరగోళపడే యౌవన హృదయాలు నిర్భయంగా అద్దాల్లో చూసుకోగలవేమో! ఇప్పుడు తన్ను అద్దంలోనైనా ఎవరు చూస్తారు?

నెత్తికి టోపీ పెట్టాడు. బొజ్జకు బెల్టు బిగించాడు ముఖానికి స్నో రాసాడు. మీసాలు తీసేసాడు. తెల్లవెంట్రుకలు కనపడకుండా గెడ్డం నున్నపరుచుకున్నాడు. అద్దంలో చూసుకున్నాడు. సంతోషపడ్డాడు కాలం మార్పును ధిక్కరించానని.

పిల్లల తల్లిగా వధువు డొలకలా మారింది. తెల్లని శిరోజాలు శిరస్సును వెక్కిరిస్తున్నాయి. బలవంతంగా తెల్లశిరోజాలు ఊడబెరికింది ఇల్లాలు కోపంగా. ప్రతీ ప్రొద్దున్న అద్దంలో తెల్ల శిరోజాలు కనిపిస్తూనే వున్నాయి. వాలుజడ కొప్పు పెట్టి, అందమైన నల్ల వల తలకు కట్టింది. వెలవెల బారుతున్న పెదాలకు ఎర్రరంగు పూసింది. పేలవమైన చెక్కిళ్ళపై దట్టంగా స్నో రుద్దింది. నాజూకుగా సిల్కుచీర కట్టింది. అద్దంలో మళ్ళీ చూసుకుంది. "కొంత నయం!" అంటూ సంతృప్తి పడింది, వయసు దాటుతున్న నవ వధువు.

ఒకరోజు ఇల్లంతా విషాదంలో విచారంగా ఆక్రందించింది. నిలువుటద్దంలో మంచంమీద కట్టెలా మారిన భర్త, సంచలనంలేని మట్టి ముద్దగా మారాడు. తిలకం కన్నీరు నిండిన కొంగు తుడిచి వేయడం వల్ల, వదనం పాలిపోయింది వధువుకు. ఆహ్లాదంగా నవ్వుకున్న నవ వధువు రూపం అంతమయింది. అద్దమే వెక్కిరించింది! వికృతంగా వెక్కిరించింది.

వైధవ్యం, వార్ధక్యం మూర్తీభవించిన ఆమెలో ఒకప్పటి వయసు రూపం మారింది. అద్దమే లేకపోతే ఆకారాల మార్పు అనూహ్యం కదూ!

చిన్నప్పటి స్నేహితులుగూర్చి అనేక వార్తలు వింది. ఒకామె డాక్టరయింది. మరొకతె నర్సు...మరొక స్త్రీ లేచిపోయి కులటగా మారింది.... మరొక స్నేహితురాలు ఆత్మహత్య చేసుకుంది... మరొకతె విధవ అయి ఉపాధ్యాయినిగా పని చేస్తోంది... తను పిల్లల తల్లిగా మారింది.

స్నేహితులంతా ఊహ అనే అద్దంలో ప్రతిబింబించారు. వదనాలు వేరైనా కాలం మార్పు అందరిలో ఒకే లక్షణాలు తెచ్చింది... దినాల రాపిడిలో, దిగులుల ఒరిపిడిలో, వడలిపోయిన ఒడలుతో, ముడతలు పడిన వదనాలు!

వరండాలో అద్దం తీయించమని ఆజ్ఞాపించింది నవ వధువు! ఒంగిన నడుముతో